


# భూగోళంలో మావిడిపిందెల పరికిణీ

**కా**ళ్ళీడ్చుకుంటూ నీరసంగా ఇంటికొచ్చాను బడి నించి. ''అమ్మా! ఒక్కసారి నా వళ్ళు ముట్టుకు చూడవా, జరం వచ్చిందేమో.'' అమ్మ వెంటనే నుదురు మీద చెయ్యిపెట్టి చూసింది.

''ఊ! వెచ్చగానే వుంది. బడొదలగానే ఒక్కసారయినా తిన్నగా ఇంటికొచ్చావా? అడ్డమయిన చోట్ల తిరుగుతావు. చూడు మొహం ఎలా వాడిపోయిందో పిచ్చిపిల్లా!''

''అమ్మా! నన్ను రాత్రి నీ దగ్గిర పడుకోబెట్టుకోవా? భయం వేస్తోందీ!''

''పడుకుంటే పడుకోగానీ ఈ భయవేవిటి ఈ పాటి జరానికి.'' అమ్మ తన మంచం మీద పడుకోమని నాన్న రగ్గు కప్పి పక్కనే కూచుంది. అసలెప్పుడూ జరంవస్తే బాగుణ్ణని నాకెంత మనసో! అందరూ మన గురించే అడుగుతారు. నాన్న బత్తాయి రసం తీసిస్తారు. అమ్మ బ్రెడ్డుకాల్చిచ్చి పక్కనే కూచుంటుంది. కానీ అదేం ఖర్మో! వుత్తప్పుడు బ్రెడ్డు అంత బాగుంటుందా! జరంవస్తే తిన బుద్ధే కాదు? కానీ ఈ విషయంలో కూడా నా కదృష్టం లేదు. ఎప్పుడోగానీ జరమే రాదు.

''అమ్మా! నే చచ్చిపోతానేమోనే!''

''నానీ! ఏవిట్రా పిచ్చిమాటలు! వుండు అమ్మమ్మగారిని వుప్పు తీయమని చెప్పొస్తాను! ఈ పాటి జరానికి భయపడలారా ఎవరన్నా?''

''సాయంత్రం బడి నుంచొచ్చేటప్పుడు కూడా ఇది ఇలాటి పిచ్చిమాటలే మాట్లాడిందే! ముందేమో అమ్మా! నాన్నా! చచ్చిపోతారా అనడిగింది. శుబ్బరంగా చచ్చిపోతారని చెప్పా! మరి నువ్వూ, నేనూ అంది. మనవూ అంతే అన్నా. మళ్ళీ అడిగిందే అమ్మమ్మగారూ, తాతగారూ ఇందూ, బుజ్జీ - అంటూ ఇంక నాకు విసుగుపుట్టి చచ్చినట్లు అందరూ చావాల్సిందే. ఎప్పుడో ఓ అప్పుడు అని చెప్పా. దాంతో నోరు మూసుకుని నా జడుచ్చుకుని నా వెనకాతలే నడుస్తూ వచ్చింది'' చిన్నారి పాపం చాలా వివరంగా చెప్పింది.

''ఏడవలేకపోయావు! బడి నుంచి ఇంటికొచ్చేప్పుడు ఇవా కబుర్లు! నీకు తెలుసుగా వెర్రి బాగుల్ది, అదెంత జడుసుకుందో ఏం పాడో! అదడిగినా నాకేం తెలియదని వూరుకోలేవూ?'' అమ్మ దాన్నే కేకలేసింది.

''నేనేం వెర్రి బాగుల్దాన్నీ కాదు పిచ్చి బాగుల్దాన్నీ కాదు. అలా అనుకుని మీరానందించండి. నాకు తెల్సిన విషయాలు మీకు ఎలా తెలుస్తాయి? మెర్సీ సిస్టరు చెప్పిన భూగోళం పాఠం వింటే కదా!''

''సర్లే! నీకే అన్నీ తెలుసు గానీలే! ఈ పాటి దానికన్నం మానేయక్కర్లేదు. నీకిష్టమని ఆనప కాయ పాలకూర సాంబారు చేశాను'' - అమ్మ అప్పుడే రగ్గు కూడా లాగేసింది.

''ఎందుకమ్మా ఇష్టం అనుకోడం. అన్నీ చేసుకు తినడం. ఏం తిన్నా కాసేపట్లో ఎలాగూ మర్చిపోతాంగదా?''

''మర్చిపోతే మళ్ళీ మళ్ళీ చేసుకుతిని గుర్తుంచుకోవచ్చులే! అన్నం తినేస్తే అన్ని జరాలు ఎగ్గిరిపోతాయి. నాన్నొచ్చేటప్పటికి నువ్వు పడుకునుంటే డ్వాక్టరంటారు మరి. లేవాలి ... లేవాలి.''

అన్నం తినడానికయితే వచ్చాగానీ ఏవీ సయించలేదు. కానీ డ్వాక్టరు గారిని తప్పించుకోవాలంటే ఏదో ఓటి తిన్నామనిపించాలి కదా! ఇంతట్లోకే ఇల్లుగల అమ్మమ్మగారొచ్చి మా నలుగురిపక్కనా అమ్మని కూడా నించోబెట్టి వుప్పుతీసేశారు.

''సరోజమ్మా! నలుగురు పిల్లలకి ఒకే రకం బట్టలేసి వీధుల్లో తిప్పద్దంటే వినవు! తాను పళంగా కొంటే కలిసొస్తుందంటావు. ఎవరి కళ్ళు పడ్డాయో!'' అంటూ పెరట్లోకెళ్ళిపోయారు వుప్పు నీళ్ళల్లో పోసేందుకు.

నన్ను చూసి పాపం అమ్మక్కూడా జాలనిపించిందేమో! ''నానీ! దీపావళికి మీకు గౌనులు కుట్టించనా? పరికిణీ జాకెట్లు కావాలా?''

''నీ ఇష్టవమ్మా! ఏం కొనుక్కున్నా ఇప్పుడింత కొత్తవయినా మళ్ళీ ఎలాగూ సంకురాత్రికల్లా పాతవనే అంటాం కదా!''

''ఇదెక్కడిగోలే నా తల్లీ! పోనీ కేరమ్సాడుకుందామా! మనిద్దరం ఓ జట్టుండి చిన్నారీ ఇందూని ఓడించేద్దాం.''

''వద్దు! నాకేం ఆడాలని లేదు. మళ్ళీ పడుకోవాలని వుంది'' అని చెప్పి నాన్న రగ్గు ముసుగెట్టాను. ఆ రగ్గు ముసుగులోంచి లైటుకేసి చూస్తే అంతా నల్లగా ఆకాశంలాగా చిల్లులన్నీ నక్షత్రాలులాగా కనిపించి మధ్యాహ్నం మెర్సీ సిస్టరు చెప్పిన భూగోళం పాఠం గాపకం వచ్చింది. నే ఇన్నాళ్ళూ ప్రపంచం అంటే మన గుంటూరు, బెజవాడ, ఢిల్లీ పోనీ మన భారతదేశం, భూగోళం, సూర్యుడూ, చంద్రుడూ, నక్షత్రాలూ అనుకున్నా. కానీ మన సూర్యుడు, భూమీ, గ్రహాలూ కలిపితే ఒక సౌర కుటుంబంట. అలాటివి కొన్ని వేల, లక్షల సౌర కుటుంబాలున్నాయిట. బోల్డు మంది సూర్యులుంటారుట. అక్కడికీ నాకు నమ్మకం కుదరక సిస్టర్ని అడగనే అడిగాను. మరి అన్ని సూర్యుళ్ళుంటే మనకి కనిపించరేమని!

''స్కూలు గేటు దగ్గిర నువ్వుంటే క్లాసులో వున్న నేనే సరిగ్గా కనబడను గదా. మరి అన్ని వేల కోట్ల మైళ్ళ దూరాన్న వున్న సూర్యులు మనకెలా కనిపిస్తారూ? అనంతమయిన సూర్యులూ, సౌర కుటుంబాలూ వున్నాయి. నిజానికి మనకి చాలా

చిన్నగా కనిపించే నక్షత్రాలు, సూర్యుడికన్నా పెద్దవి. కానీ చాలా దూరంగా వుంటాయి కాబట్టి మనకి చిన్నగా అనిపిస్తాయ''ని చెప్పారు.

ఇట్లా ఆవిడే ఏవిటేవిటో చెప్పారు. ఎన్నో కోట్ల సంవత్సరాల క్రితం మన భూమికూడా సూర్య గోళంలా వుండేదిట. కానీ చల్లారి గట్టిపడినప్పుడు కొండలు, సముద్రాలు ఏర్పడ్డాయిట. అందుకనే భూమిని కాల్చి చల్లారుతున్న వంకాయితో పోలుస్తారుట. అయినా నాకు నమ్మకం కుదరక అడిగా.

''సిస్టర్! మరి ఇంత కచ్చితంగా పగలూ, రాత్రీ, ఎండా, వానా అన్నీ టయానికి అయ్యేలా ఎలా చూస్తారు? ఒక్కసారి కూడా లేటవకుండా పండగలెలా వస్తాయ''ని.

''అన్నీ ప్రకృతి నియమం ప్రకారం జరుగుతాయి. సృష్టి నియమాల్ని ఏదీ అతిక్రమించలేదు. ఈ సృష్టినంతా పాలించే వాడే ప్రభువు! మనందరికీ తండ్రి'' అంటూ ఏవేవో చెప్పి వెళ్ళిపోయారు.

ఇంకా నయం! నేనసలు ఈ వేళ బడి కెళ్ళద్దనుకున్నా, వెళ్ళకపోతే ఈ విషయాలన్నీ తెలిసేవి కాదు కదా! కానీ ఎంత దిగులేస్తోందో తల్చుకుంటే, నేనిన్నాళ్ళూ మన భూగోళమే గొప్పదనుకునే దాన్ని. ఆ భూగోళమే ఇసుక రేణువు కన్నా చిన్నదంటే ఇంక మిగతా వాటి లెఖ్ఖేవిటి? భారత దేశం మాటలా వుంచి మన గుంటూరు, మన స్కూలు సోదిలోకి కూడా రావు.

ఎందుకూరికే కష్టపడి చదువుకోవడం, నేర్చుకోవడం మళ్ళీ చచ్చిపోడం. అంతా దండగ. టైం వేస్టు. క్లాసులో ఫస్టు రావాలని చావడం ఎంత పిచ్చిపనో! దాని బదులు ఎటన్నా తిరిగొస్తే అప్పటి మటుక్కన్నా హాయి వుంటుంది. అసలా క్లాసయి పోగానే నాకు భయానికి చాలా ఏడుపొచ్చేసింది. కానీ పిల్లలంతా చీమకుట్టినట్లన్నా లేకుండా నవ్వుకుంటూ గోలగోల చేస్తూ వెళ్ళిపోయారు. ఒక్కళ్ళు కూడా భయపడ్డట్టు అనిపించలా. ఇంటికొచ్చేటప్పుడు చిన్నారి నడిగితే అది మహా పోజు!

''అవునే! అందుకే నిన్ను చందమామలన్నీ సరిగ్గా చదవమంటా! ఎంత మంది రాజులు చచ్చిపోయి యువరాజుల్ని- రాజుల్ని చేసెయ్యలేదూ! పెద్ద సెట్టి చచ్చితే కొడుకులు దుకాణాలు పంచుకోరూ? పట్టపురాణీ చచ్చిపోతే సవితిరాణీ వచ్చి పిల్లల్ని కష్టాలు పెట్టదూ! ఇందులో కొత్తేమిటి? పుట్టే వాళ్ళు పుడతారు! చచ్చిపోయే వాళ్ళు చచ్చిపోతారు. పద పద అమ్మ కోప్పడుతుంది ఆలీసవయితే అని'' అడుగులేసింది తొందరగా!

''ఏదో పెద్ద పక్కనుంది కదాని దాన్నడిగా కానీ నాకు మాత్రం తెలియదా ఈ పాటి! కాపోతే ఇవన్నీ మనకి జరగవులే అనుకుని ఆలోచించకుండా వూరుకున్నా. అదే నే చేసిన తప్పు. తెలిసినవే కదాని మనం ఎదురుగా చూసే వాటిని గురించి ఆలోచించకపోతే ఒక్కసారి తెలుసుకుని భయపడాల్సొస్తుందికాదా!''

ఇంతట్లోకీ నాన్న గొంతు వినిపించింది. ''నానీ ఏది? చీకటి పడ్డాక కూడా ఎవరిళ్ళకి తిరుగుతోందీ?'' వెంటనే లేచి వీధి గదిలోకి వచ్చా!

''లేదు నాన్నా! ఎక్కడికీ తిరగట్లేదు. అన్నం



కూడా తినేశా! వూరికే తోచక పడుకున్నా!''

అమ్మందుకుంది ''ఈ వేళ సాయంత్రం నించీ దీని మొఖం చూడలేక, దీని వైరాగ్యం వాగుడు వినలేక చస్తున్నాం! పాపం ఈవిడగారు పడకెయ్యడంతో గుంటూరు వీధులన్నీ చిన్న బోయాయి. స్కూల్లో సిస్టరు భూగోళం పాఠంతో విశ్వదర్శనం చేయించి నట్టున్నారు. ఇది జడుసుకుని మా ప్రాణాలు తీస్తోంది. మొఖం చూడండెలా పీక్కుపో యిందో!''

''అవును నాన్నా! మనవంతా ఈ ప్రకృతిలో చాలా నలుసులం. మనం ఎంతో పెద్దదనుకునే భూగోళమే ఇసుక రేణువు కన్నా చిన్నది. ఇంక మనుషులయితే చీమల్లాంటి వాళ్ళే. ఎస్.కె.ఎస్ అయినా డి.వి.ఎన్ అయినా చివరికి నెహ్రూ గారు కూడా ఏం గొప్ప లేదు. అంతా ప్రకృతి నియమాల ప్రకారం బతకాలి. చావాలి. ఒక్కళ్ళు కూడా తప్పించుకోలేం!''

నాన్న కాసేపు ఏం మాట్లాడలేదు. పాపం తను కూడా నాలుగో క్లాసు పాఠం గుర్తుకు తెచ్చుకోవాలి కదా!

''మీ సిస్టరు ఏం చెప్పారు? ప్రకృతి నియమాలా! అవంటే ఏవిటి మరి? నదులు ప్రవహించాలి. వానలు కురవాలి. ఎండలు కాయాలి. అలాగే రైతులు పంటలు పండించాలి. నెహ్రూ గారూ అందరూ రాజ్యం నడపాలి. మనవంతా మన పన్లు చక్కగా చెయ్యాలి. నేనేమో నాన్నని కదా. వుద్యోగం చేసి డబ్బులు సంపాయించాలి. అమ్మేమో అతి జాగర్తగా ఖర్చుపెట్టి మనందరికీ అన్నాలవీ చేసి పెట్టాలి. మరి మీ సిస్టర్ల నియమాలేవిటి? మీ అందరికీ చదువు చెప్పడం. మరి మీ నియమాలేవిటి?''

''బాగా చదువుకోవడం. అమ్మ చెప్పినట్టు వినడం క్లాసులో ఫస్టు రావడం.''

''అదీ! ఎవరి పనులు వాళ్ళు చెయ్యడమే నియమమన్నమాట. మిగతా వాటి గురించి నువ్విప్పుడ్నించీ ఆలోచించక్కర్లేదు. మీరంతా చక్కగా పెరిగి పెద్దయ్యే వరకు నేనూ, అమ్మా, మిమ్మల్ని చూసుకుంటూ వుంటావన్నమాట. మనం రోజూ ఇలాగే నవ్వుకుంటూ సరదాగా వుంటాం. ఎవ్వరికీ ఏవీ కాదు. వుత్తుత్తినే భయాలు పడకూడదు. మరి మనం దీపావళి బట్టలు కొనుక్కోవాలి కదా. ఎవరికేం కావాలో రాసివ్వండి మరి!''

చిన్నారి చెప్పింది ''ఎవరిలిస్టు వాళ్ళదే నాన్నా'' అని నాకో కాయితం, పెన్సిలూ ఇచ్చి వెళ్ళింది. ఎంతయినా పాపం నాకు జడుపుజరం కదా!

నా లిస్టు తయారయింది. (1) గులాబీ రంగు సాటిను పరికిణీ - అరన్నా మామిడి పిందెలు కుట్టించాలి. (2) నల్ల వెల్వెట్ జాకెట్టు - చేతుల మీద రెండు చిన్న మామిడి పిందెలు చాలు. (3) నాలుగు సాటిన్ రిబ్బన్లు. (4) ముదర ఎరుపు గోళ్ళ రంగు - నా ఒక్క దానికోసవే ఎవరికీ ఇమ్మనకూడదు.

నా లిస్టు చూసి అమ్మ మొఖం ఇంతయింది. ''మీ సర్వసంగ పరిత్యాగి నానీగారి దీపావళి లిస్టు చూడండి. మీ బోనసంతా దానికే చాలదు.. మా అందరి పని గోవిందానే...''

**–సోమరాజు సుశీల**